

వెతలు తీరేనా?
ఏళ్లు గడుస్తున్నా.. కాంట్రాక్టర్లు మారుతున్నా వంతెన నిర్మాణం పూర్తికావడంలేదు. సమస్య తీరడంలేదు. 8లో▸



వినతుల వెల్లువ
వికారాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్ రావుకు ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. 8లో▸



నామమాత్రంగా గ్రామసభలు
పల్లెల్లో నెలకొన్న మస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలు నామమాత్రంగా సాగుతున్నాయి. 9లో▸



న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న వీఓఏలు

తాండూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన వీఏఓలు గురువారం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రోహిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నెలకు రూ.18 వేల వేతనం ,ఐడీ కార్డులతో పాటు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇవ్వాలని అభ్యర్థించారు. రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్, తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాల వీఓఏలు పాల్గొన్నారు. వీరి వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

16న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2023- 24 విద్యాసంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి 12గంటల వరకు, 7, 8, 9, 10 తరగతుల్లో అడ్మిషన్ కోసం మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులందరూ గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులతో పాటు సిబ్బంది, అధికారులకు సైతం పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు.

ఆనంద్‌ను దీవించండి



మర్పల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

రెండోసారి అసెంబ్లీకి పంపించండి
- జిల్లాలో పాలమూరు నీరు పారించి తీరుతాం
- ఎత్తిపోతల పనులు చివరి దశకు చేరుకున్నాయి
- గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే
- మూడు నెలల్లో మెడికల్ కాలేజీ, ఆస్పత్రి సేవలు
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు

మర్పల్లి, వికారాబాద్: నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన గురువారం మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది ఆత్మీయ సమ్మేళనంలా లేదని, విజయోత్సవ సభలా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల పనితీరు, ఎమ్మెల్యే ఆనంద్‌పై ఈ ప్రాంత ప్రజలకున్న అభిమానానికి ఇదే నిదర్శనమని కొనియాడారు.

రూ.15 కోట్లతో ఆయుష్ ఆస్పత్రి

పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జిల్లాలో త్వరలోనే సాగు నీరు పారిస్తామని మంత్రి స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించిన పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. త్వరలోనే కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను నింపుతామని స్పష్టంచేశారు. జిల్లాలో కాల్వల తవ్వకం పనులను కొద్ది రోజుల్లోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని వివరించారు. యాభై ఏళ్ల కాలంలో గత పాలకులు తెలంగాణకు 20 మెడికల్ కాలేజీలు ఇస్తే.. కేవలం ఎనిమిదేళ్లలో సీఎం కేసీఆర్ 37 కాలేజీలు ఏర్పాటు చేయించారన్నారు. రాష్ట్రానికి మూడు ఆయుష్ ఆస్పత్రులు రాగా.. ఇందులో ఒకటి వికారాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం రూ.15 కోట్లు వెచ్చించామన్నారు. వికారాబాద్‌లో కనీసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయని స్థితిలో ఆంధ్రా పాలకులు వదిలేయగా.. రూ.250 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల, అనుబంధ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్ ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. త్వరలోనే వికారాబాద్‌కు సీటీ స్కానింగ్ మిషన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో 600 పడకల ఆస్పత్రి, 150 మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని తెలిపారు. మరో మూడు నెలల్లో వికారాబాద్‌లో మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రి సేవలు ప్రారంభమవుతాయని స్పష్టంచేశారు.

సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తా..

ఎమ్మెల్యే ఆనంద్‌తో పాటు స్థానిక నేతల కోరిక మేరకు మర్పల్లిలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం కోసం రూ.10 కోట్లు ఇచ్చేలా సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తానని మంత్రి హరీశ్ హామీ ఇచ్చారు. బీజేపీ ఏమిచ్చిందో.. కాంగ్రెస్ రైతులను ఎంత కష్టపెట్టిందో అందరికీ తెలుసన్నారు. రైతుకు ఆత్మగౌరవం తెచ్చిన నాయకుడు కేసీఆర్ కాదా..? తెలంగాణ ఏర్పాటు తర్వాత భూముల ధరలు పెరిగింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. అందుకే కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చూద్దామన్నారు.

కుటుంబ సభ్యుల్లా కలిసి ఉందాం..

బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మన మధ్య ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే కూర్చుని మాట్లాడుకుందామని, అందరూ బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల్లా కలిసి ఉండాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమంలో బీఆర్‌ఎస్‌కు ఎవరూ సాటిలేరన్నారు.

కేసీఆర్ రాకుంటే జిల్లా అయ్యేదా..?

పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ లేకుంటే.. సీఎం కేసీఆర్ రాకుంటే.. వికారాబాద్ జిల్లా అయ్యేదా..? మన జిల్లా చార్మినార్ జోన్‌లో కలిసేదా..? వికారాబాద్‌లో ఇంత అభివృద్ధి జరిగేదా..? అని ప్రశ్నించారు. జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ఆయుష్ ఆస్పత్రి, డ్రగ్ స్టోరేజీ సెంటర్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాకు పాలమూరు నీటితో పాటు కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.6 కోట్లతో డ్రగ్ స్టోరేజీ కేంద్రం

వికారాబాద్‌కు మంజూరైన ఆయుష్ ఆస్పత్రితో పాటు సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, యాదయ్య, మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి,బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.అనంతగిరి గుట్టపై పనులు కొనసాగుతున్న మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రులను సందర్శించారు.నిర్మాణ పనులు,బ్లాక్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.రూ.3.6 కోట్లతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అనంతరం గుట్టపై వెలిసిన అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల,వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, ఆర్డీఓ విజయకుమారి, ఎంపీపీ చంద్రకళ, బీఆర్‌ఎస్ నేత నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని అనంతగిరి గుట్టపై ఆయుష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్



మల్కాయిపేటతండాలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఫైరవీలు లేకుండానే పథకాలు

- కేసీఆర్ పాలనలోనే ఇది సాధ్యమైంది
- పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమానికి నిధులు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పరిగి మండలంలో 'పల్లెబాట'

పరిగి: సీఎం కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాతే ఎలాంటి పైరవీలు లేకుండానే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రాహీంపూర్, రూప్‌సింగ్‌తండా, మల్కాయిపేటతండా, సాలేపల్లేబాటతండా, రూప్‌ఖాన్‌పేట్, సుల్తాన్‌పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో పైరవీలు చేసిన వారికే పథకాలు వచ్చేవన్నారు.పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ పార్టీ సర్పంచ్‌లు వచ్చి అడిగినా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలం వచ్చిందంటే మహిళలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ద్వారా నీరు సరఫరా అవుతోందని తెలిపారు. రాష్ట్రంలో దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలుసుకుని, వీరికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకువచ్చారన్నారు. అర్హులైన వారికి దశలవారీగా సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టంచేశారు.ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలోనే సాధ్యమైందని తెలిపారు. వచ్చే నెలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని చెప్పారు. దేశం మొత్తం కేసీఆర్ పాలనను కోరుకుంటోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ రాజేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయండి



అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశం
- సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్

వికారాబాద్ అర్బన్: యాసంగి ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ధాన్యం సేకరణపై గురువారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 123 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, వెయింగ్ మిషన్లు అందుబాటులో పెడుతామని స్పష్టంచేశారు. అన్ని సెంటర్ల వద్ద వసతులు కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలని ఆదేశించారు. ఏప్రిల్ చివరి నాటికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. రైతులెవరూ దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ రాజేశ్వర్, మేనేజర్ విమల, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీఆర్‌డీఓ కృష్ణన్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తదితరులు టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మండలం ఇస్తే.. పూర్తి మద్దతు



మాట్లాడుతున్న తట్టెపల్లి మండల సాధన సమితి ఉపాధ్యక్షుడు గోపాల్

- తట్టెపల్లి మండల సాధన సమితి నేతలు

పెద్దేముల్: కర్ణాటక- తెలంగాణ సరిహద్దులో ఉన్న వెనకబడిన ప్రాంతమైన తట్టెపల్లిని మండలముగా ప్రకటిస్తే బీఆర్‌ఎస్‌తో పాటు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి పూర్తి మద్దతు తెలుపుతామని మండల సాధన సమితి నేతలు అన్నారు. ఈమేరకు గ్రామంలో గురువారం నిర్వహించిన నిరసన దీక్షాశిబిరం వద్ద వారు మాట్లాడుతూ.. 11 గ్రామ పంచాయతీలతో కలిపి తట్టెపల్లిని మండలం చేయాలన్నారు. ప్రస్తుతమున్న పెద్దేముల్ తమకు 30 కిలోమీటర్ల దూరంలో ఉందని, దీంతో ఏ చిన్న పనికోసం వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. తట్టెపల్లి చుటుపక్కల గిరిజన తండాలు అధికంగా ఉన్నాయని, దీన్ని మండలం చేస్తే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మండల సాధన సమితి ఉపాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కార్యదర్శి శంకర్, పీఏసీఎస్ మాజీ డైరక్టర్ ప్రభుకుమార్, గ్రామ ఉప సర్పంచు కిష్టప్ప, నాయకులు వెంకటయ్య, రాంచంద్రయ్య, చంద్రప్ప, రామప్ప, బక్కన్న, పండరి, సత్తార్, విజయ్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

తాండూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఏఐసీసీ సభ్యుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేశ్‌మహరాజ్ ముస్లింలతో కలిసి విందులో పాల్గొన్నారు. అంతకు ముందు కింగ్స్ ప్యాలెస్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు ఖుర్షీద్, ఎంఐఎం నేత హాదీశాహేరీ, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేశ్‌మహారాజ్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

'కాగ్నా'లో తవ్వకాలు నిజమే



కాగ్నాలో చేపట్టిన ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

- రెవెన్యూ అధికారుల నిర్ధారణ
- మన భూ భాగంలోకి చొచ్చుకొచ్చినట్లు గుర్తింపు
- వాహనాలను తరలించి ముందుగానే సర్దుకున్న కాంట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: కాగ్నా నదిలో కొనసాగుతున్న ఇసుక దోపిడీపై 'కాగ్నాలో ఇసుక తోడేళ్లు' శీర్షికతో ఈనెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వీరేషబాబు, వీఆర్‌ఏల బృందం సభ్యులు గురువారం కాగ్నాను సందర్శించారు. కర్ణాటకకు చెందిన కాంట్రాక్టర్ అనుమతుల మాటున నది మధ్యలో ర్యాంపు వేసి తెలంగాణ భూభాగంలో ఇసుక తవ్వకాలు జరిపినట్లు అధికారుల బృందం గుర్తించింది. 'సాక్షి'లో కథనం రావడంతో సదరు కాంట్రాక్టర్ నదిలో తవ్వకాలను నిలిపేశారు. అధికారులు తనిఖీకి వస్తారని ముందే ఊహించి హిటాచీలు, టిప్పర్లను అక్కడి నుంచి తరలించాడు. ఇదిలా ఉండగా మళ్లీ తవ్వకాలు చేపట్టకుండా ఇద్దరు వీఆర్‌ఏలకు అధికారులు ప్రత్యేక డ్యూటీ వేశారు. ఇరు రాష్ట్రాల నడుమ అంతర్రాష్ట్ర ఒప్పందానికి తూట్లు పొడిచిన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. అనుమతులు లేకుండా ఎవరూ ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని, నిబంధనకు విరుద్ధంగా అక్రమ రవాణా చేపట్టే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఇందుకోసం వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాండూరు అగ్రిమాపక అధికారి నాగార్జున, వికారాబాద్ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, కోస్గి మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని తెలిపారు. పెద్ద నందిగామ, రావులపల్లి, టేకులకోడ్, హంసాన్‌పల్లి, దుద్యాల, సర్సాపూర్, రావులపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో కరెంటు ఉండదని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న సదానందరెడ్డి

అనంతగిరి: క్షేత్రస్థాయిలో బీజేపీ బలంగా ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ మండలం కొటాలగూడెంలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సదానందరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు నిరంతరం పనిచేయాలన్నారు. అన్ని కమిటీలను పూర్తి చేస్తున్నామన్నారు. గ్రామంలో 11 మంది కార్యకర్తలకు పలు రకాల బాధ్యతలు అప్పగించారు. 60 మంది ఓటర్లకు గాను పన్నా ప్రముఖ్‌ను నియమించారు. పార్టీ చేసే ఏ కార్యక్రమమైనా క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్, కోశాధికారి బస్వలింగం, బూత్ అధ్యక్షుడు శ్రీశైలం, శక్తి కేంద్రం ఇన్‌చార్జి యాదగిరి, శ్రీకాంత్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాపరిని కట్టేసి గొర్రెల అపహరణ

యాచారం: కాపరిని కట్టేసి గుర్తు తెలియని వ్యక్తులు 10 గొర్రెలను అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నక్కర్త మేడిపల్లికి చెందిన జీ రాములు, పీ బీరప్పలు నక్కర్తమేడిపల్లి – తక్కళ్లపల్లి గ్రామాల మధ్య గొర్రెల మందను ఏర్పాటు చేశారు. ఇద్దరికి చెందిన 200 గొర్రెలను అక్కడ ఉంచారు. బుధవారం రాత్రి మంద వద్ద బీరప్ప నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతన్ని మంచానికి కట్టేసి 10 గొర్రెలను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున బీరప్ప తోటి కాపరి జీ రాములకు సమాచారం ఇచ్చాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

వంతెన నిర్మాణమయ్యేనా.. వెతలు తీరేనా?

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని బ్రిడ్జి పనులు

- బిల్లులు సకాలంలో రాక.. పనులు సాగక
- ముచ్చటగా మూడో కాంట్రాక్టర్‌కు అప్పగింత

ధారూరు: ఏళ్లు గడుస్తున్నా.. కాంట్రాక్టర్లు మారుతున్నా వంతెన నిర్మాణం మాత్రం పూర్తికావడం లేదు. సమస్య తీరడంలేదు. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మిస్తున్న వంతెనే ఇందుకు నిదర్శనం. 2016లో కురిసిన భారీ వర్షాలకు లక్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోయి వాటి అలుగుల ద్వారా నీరు కాగ్నా నదిలో చేరి ఉధృతంగా ప్రవహించడంతో కాగ్నానదిపై ఉన్న పాత వంతెన కొట్టుకుపోయింది. రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో 2017లో కొత్త వంతెన నిర్మాణానికి రూ. 4.65 కోట్లు మంజూరు అయ్యాయి. టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల ఆందోళన మేరకు మొదటి బిల్లు మంజూరు అయ్యింది. దీంతో ఆ కాంట్రాక్టర్ పిల్లర్ల మధ్య కొద్దిగా మట్టి వేయించి పనులు చేపడుతుండటంతో 'బిల్లులు మంజూరు చేయించాం.. పనులు ప్రారంభం అయ్యాయ'ని నాయకులు సంతోషంతో ప్రచారం చేశారు. మళ్లీ మూడు రోజుల్లోనే పనులు ఆగిపోవడంతో నాయకుల్లో సంతోషం మాయమైంది. నాయకుల ఒత్తిడితో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు రెండో బిల్లు కోసం ప్రయతి్నంచారు. అయినా డబ్బులు రాకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రతి సంవత్సరం వానాకాలంలో కాగ్నానది ఉధృతంగా ప్రవహించడం.. రాకపోకలు స్తంభించిపోవడం.. పశువులు, మేకలు మృత్యువాత పడటం జరుగుతూ వస్తోంది. మూడేళ్ల క్రితం వరద ఉధృతికి ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడు. వర్షాకాలంలో తాండూరు, పరిగి, కొడంగల్‌కు వెళ్లడానికి ఈ వంతెన ద్వారానే వెళ్లాలి. పాత కాంట్రాక్టర్ స్థానంలో కొత్త కాట్రాక్టర్‌ను నియమించి పనులను ప్రారంభించారు. ఆ కాంట్రాక్టర్ అసలైన పనులు చేయకుండా నదికి ఇరువైపులా సీసీ బెడ్‌తో పిల్లర్లు నిర్మించి వదిలిపెట్టారు. అతనికి కూడా చేసిన పనికి బిల్లు రాకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. ముచ్చటగా మూడోసారి మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. ప్రస్తుతం పనులు మాత్రం జరుగుతున్నాయి. అయితే వీటికి సంబంధించిన బిల్లులు మంజూరు అవుతాయా? లేక పనులు మళ్లీ మధ్యలోనే ఆగిపోతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉంటే పాలకులు ఈసారైనా శ్రద్ధ చూపి వచ్చే వానాకాలంలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



స్టేషన్‌ధారూరు–దోర్నాల్ మధ్య కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



వంతెన నిర్మాణం కోసం తీసుకువచ్చిన స్టీల్ మెటీరియల్

కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాం



మొదటి కాంట్రాక్టర్ చేసిన పనులకు పూర్తి బిల్లులు ఇచ్చాం. బిల్లులు రాగానే పని చేస్తున్నట్లు మట్టి పని మొదలు పెట్టి అకస్మాత్తుగా నిలిపివేశారు. ముందుగా అతనికి నోటీసు జారీచేసి సంజాయిషి తీసుకున్నాం. తర్వాత అతని స్థానంలో రెండో కాంట్రాక్టర్‌ను నియమించాం. అతను కూడా అనుకున్న సమయానికి నిర్ణీత పనులు చేయకపోవడంతో అతన్ని సైతం తొలగించాం. మూడో కాంట్రాక్టర్‌ను నియమించాం. ప్రస్తుతం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. రానున్న వానాకాలం వరకు పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రావణ్‌కుమార్, ఏఈ, ఆర్ అండ్ బీ

ఆస్తి కోసం కన్నతండ్రిని మట్టుబెట్టిన తనయులు



వెంకటప్ప (ఫైల్)

అనంతగిరి: ఆస్తి కోసం కన్నతండ్రిని మట్టుబెట్టిన ఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ శీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామయ్యగూడకు చెందిన వడ్డె వెంకటప్ప(65)కు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య పోచమ్మకు ఒక కుమార్తె ఉండగా, రెండో భార్య సత్యమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యమ్మ, పోచమ్మలు అక్క చెల్లెళ్లు. ఇదిలా ఉంటే కొన్ని రోజులుగా తండ్రి వెంకటప్ప ఇంటిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని కుమారులు శ్రీను, రాములు తండ్రితో గొడవ పడుతున్నారు. దీంతో వెంకటప్ప తాను చనిపోయే వరకు ఇంటిని రిజిస్ట్రేషన్ చేయనని చెప్పడంతో వారు కోపం పెంచుకున్నారు. మొదటి భార్య కూతురు కూతురు (మనువరాలు) పెళ్లి నిశ్చయం కావడంతో వెంకటప్ప తన పేరుపై ఉన్న ఇల్లును అమ్మి మనువరాలి పెళ్లికి డబ్బులు ఇస్తానని చెప్పడంతో మరింత కోపం పెంచుకున్నారు. ఇదే విషయంలో వెంకటప్పతో వారు గొడవకు దిగారు. కుమారుడు రాములు వెంకటప్ప తలపై రోకలి బండతో కొట్టగా, శ్రీను కత్తితో పొడిచాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన వెంకటప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మొదటిభార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

క్రిమిసంహారక మందు తాగి యువ రైతు ఆత్మహత్య



ఉప్పరి వెంకటేశ్ (ఫైల్)

దోమ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని దిర్సంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విశ్వజన్, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉప్పరి వెంకటేశ్ (24) అనే యువరైతు పంటల సాగు కోసం రూ. మూడు లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చేమార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో పంటకు పిచికారీ చేసే క్రిమిసంహారక మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోస్గి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు.

నేత్రాలు దానం..

మృతి చెందిన ఉప్పరి వెంకటేశ్ నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ అస్పత్రికి దానం చేశారు. అస్పత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాయకుల మధ్య ఫ్లెక్సీ రగడ



బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం

పరిగి: బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఫ్లెక్సీల రగడ చెలరేగింది. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సర్పంచ్ వర్గీయులు తీసివేయడంతో రెండు పార్టీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొప్పుల మహేశ్‌రెడ్డి మూడు రోజులుగా పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రూప్‌ఖాన్‌పేట్‌లో పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చిన నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని, సొమ్ము ఒకరిది సోకు మరొకరిదని ఆగ్రహించిన బీజేపీ సర్పంచ్ నరసింహ పంచాయతీ కార్మికులతో ఫ్లెక్సీని తీయించారు. దీంతో ఇరుపార్టీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురిని సముదాయించి పంపించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులకు సమాచారం ఇచ్చే ఫ్లెక్సీలను తీయించామని సర్పంచ్ తెలిపారు.

చిన్నారి మృతి

- వైద్యం వికటించడం వల్లేనంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- తుంకిమెట్లలో ఘటన



మృతిచెందిన చిన్నారి

బొంరాస్‌పేట: చికిత్స పొందుతూ ఓ చిన్నారి మృతి చెందింది. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లే మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తూ రోదించారు. ఈ ఘటన మండల పరిధిలోని తుంకిమెట్లలో గురువారం చోటుచేసుకుంది. దోమ మండలం దిర్సంపలి పెద్దతండాకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బాలు కొన్ని నెలలుగా తుంకిమెట్ల గ్రామంలో క్లినిక్ నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలో రోడ్డు నిర్మాణం పనులు చేసుకొని బతుకుతున్న వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాలపల్లికి చెందిన దంపతులు మహేశ్వరి, బీసన్న పనిచేస్తున్నారు. వీరి కూతురు స్నేహలత (5నెలలు) అనారోగ్యంతో ఉండటంతో ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు గురువారం తీసుకువచ్చారు. బాలు వైద్యం చేసి పంపారు. అకస్మాత్తుగా చిన్నారి మృతిచెందింది. దీంతో వైద్యం వికటించడంవల్లే తమ చిన్నారి మృతిచెందినట్లు దంపతులు ఆరోపిస్తూ విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. మృతి చెందిన చిన్నారిని పోస్టుమార్టమ్ కోసం పరిగి ఆస్పత్రికి తరలించారు. ఆర్ఎంపీ వైద్యుడు బాలును అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తు చేసి, పూర్తి వివరాలు సేకరించి శుక్రవారం వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు తరలిరండి



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: తిరుపతిలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్‌కు చెందిన అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ జాతీయాధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కృషి చేస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ, మాదిగ హక్కుల కోసం తిరుపతిలో జరుగనున్న జాతీయ సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్లు శేఖర్, ప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలోనే అభివృద్ధి చేసి చూపించా



గోట్లపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: తాండూరు నియోజకవర్గంలో గత పాలకులు అభివృద్ధిని విస్మరించారని, ఎవరూ చేయని అభివృద్ధిని నాలుగేళ్లలోనే చేసి చూపించానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గిర్మాపూర్, గోట్లపల్లి, హన్మపూర్, హసేనాయక్ తండా, జెరాంతండా, ఇందూర్, ఆత్కూర్, తట్టెపల్లి గ్రామాల్లో పల్లె పల్లెకు పైలట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పక్కనే ఉన్న బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలో పెన్షన్ నెలకు రూ.600 ఇస్తే.. మనం నెలకు రూ.2 వేలు ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు ఉండేవని.. ప్రస్తుతం 24 గంటల కరెంట్ అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, సర్పంచులు పద్మమ్మ, సుమలత, ఎస్.పద్మమ్మ, రాంరెడ్డి, వెంకటమ్మ, ఎంపీటీసీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు వినతుల వెల్లువ



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: వికారాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతగిరి ఆలయం వద్ద వీరంతా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

రెగ్యులరైజ్ చేయాలి

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ అసోసియేషన్ జిల్లా తరుపున వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లు పూర్తయినా రెగ్యులరైజ్ చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, అధ్యక్షుడు రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసన్న ఉన్నారు.

పే స్కేలు వర్తింపజేయాలి

ఉపాధిహామీలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులకు పే స్కేలు వర్తింపజేయాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగుల జిల్లా జేపీసీ చైర్మన్ నవీన్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు, ఈసీ, టీఏ, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

మెప్మాలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల వేతనాలను రూ.20వేలకు పెంచాలని ఆ సంఘం జిల్లా ప్రతినిధులు తెలిపారు. వెంటనే హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.6వేలతో కుటుంబాలు గడవడం భారంగా మారిందన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

అనంతగిరి: మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. ఎన్‌టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు గజమాలతో మంత్రిని ఆహ్వానం పలికారు. అనంతగిరిగుట్ట ఆలయానికి చేరుకున్న మంత్రికి కలెక్టర్, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మర్పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి హరీశ్‌రావుకు స్థానిక నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, నాయకులు నర్సింహరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



మోమిన్‌పేట: మంత్రి హరీశ్‌రావుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



రామస్వామి (ఫైల్)

బషీరాబాద్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ గ్రామం జయంతి కాలనీకి చెందిన కొంకర రామస్వామి(56) గురువారం ఇంటికి నడుచు కుంటూ వస్తుండగా వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజరత్నంకు మృతుడు సోదరుడు. రామస్వామికి భార్య విజయలక్ష్మి, కూతురు మౌనిక ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక దాడి నిందితుడికి రిమాండ్

కద్లాల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన గానుగుమార్ల తండా సర్పంచ్ భర్త మోత్యానాయక్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆమనగల్లు సీఐ కథనం మేరకు.. తండాకు చెందిన నేనావత్ మోత్యానాయక్ బాలికపై లైంగిక దాడి పాల్పడడంతో బుధవారం బాధిత కుటుంబం కద్లాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సర్పంచ్ భర్తపై సస్పెన్షన్ వేటు

కద్లాల్: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన గానుగుమార్ల తండా సర్పంచ్ భర్త నేనావత్ మోత్యానాయక్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కే పరమేశ్ ఈ విషయాన్ని ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కద్లాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడినందుకు పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుందని తెలిపారు.

మర్పల్లి అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి హరీశ్‌రావుకు జెడ్పీటీసీ మధుకర్ విజ్ఞప్తి

మర్పల్లి: మండలం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని జెడ్పీటీసీ మధుకర్ మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీన సమ్మేళన కార్యక్రమం నిర్వహిచారు. ఎమ్మెల్యే ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. మంత్రి ప్రత్యేక చొరవ చూపి నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. మండలంలో రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయన్నారు. మండల కేంద్రంలో నాలుగులేన్ల బీటీ రోడ్డు వేసేందుకు రూ.10 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచాలని కోరారు. మర్పల్లిలో ఐటీఐ కళాశాల భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తా, స్థానిక వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావుకు జెడ్పీటీసీ మధుకర్, స్థానిక నాయకులు గొర్రెపిల్లను, గొంగళిని బహూకరించారు.

పేదలకు అండగా ఉంటాం



ఉదన్‌రావుపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

దోమ: పేద కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉదన్‌రావుపల్లిలో నీరటి నవనీత(21) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వారు బాధిత కుటుంబాన్ని స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, అర్హులైన వారందరికీ అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరుపేద కుటుంబాలలో పెద్ద దిక్కు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహకం అందిస్తామన్నారు. అలాగే వారికి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, మదర్ డెయిరీ చైర్మన్ గోపాల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

యాచారం: రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీలు అడ్డుగా మారాయని, బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొగుళ్లవంపు గ్రామానికి చెందిన 30మంది బీజేపీ శ్రేణులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజల్లో విశ్వాసం కోల్పోయాయని అన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎనిమిదేళ్ల కాలంలో రూ. 2,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీజేపీ యూత్ నాయకుడు సీ జయరాజ్, 43వ బూత్ అధ్యక్షుడు ఎన్ వెంకటేష్ మరి కొందరు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ నాయకులు పాల్గొన్నారు.